## ప్రజల మాట ప్రగతి బాట

## సికింద్రాబాద్ నియోజకవర్గం

## ఆకట్టుకుంటున్న సిల్క్ వస్త్ర ప్రదర్శన



వస్త్రాలను కొనుగోలు చేస్తున్న మహిళలు

అడ్డగుట్ట, నవంబర్ 17 : తార్నాకలోని ఐఐసిటీ స్టాఫ్ క్లబ్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన కళా సిల్క్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్, సేల్స్ ప్రదర్శనకు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. వివిధ రకాల వస్తువులు, సరికొత్త డిజైన్‌లతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో మహిళలు, యువతులు అధిక సంఖ్యలో పాల్గొని భారీగా కొనుగోళ్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వికాస్ జైన్ మాట్లాడుతూ... నాణ్యమైన ఉత్పత్తులను అందించి వినియోగదారుల మన్ననలను పొందడమే లక్ష్యంగా ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. 65 స్టాల్స్‌గా ఏర్పాటు చేసిన ఈ వస్త్ర ప్రదర్శనలో చేనేత వస్త్రాలతో పాటు డిజైనర్ శారీస్, ఫ్యాబ్రిక్స్, ఖాదీ దుస్తులు, పోచంపల్లి శారీస్, సల్వార్ సూట్స్‌తో పాటు కశ్మీర్ షాల్స్ కళాఖండాలు, హ్యాండీక్రాఫ్ట్స్ జ్యువెల్లరీ, పెయింటింగ్స్, జూట్ బ్యాగ్స్, కాక్రిరితో పాటు విభిన్నమైన వస్తువులు ప్రదర్శనలో కొలువుదీరాయని ఆయన పేర్కొన్నారు. నవంబర్ 8వ తేదీన ప్రారంభమైన ఈ ఎగ్జిబిషన్ నవంబర్ 27 వరకు కొనసాగుతుందన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వికాస్ జైన్ సూచించారు.

## టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్




సికింద్రాబాద్ గుజరాతి సేవామండల్ టేబుల్ టెన్నిస్ అకాడమీ వేదికగా జరిగిన 10వ రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో శ్రేష్టా రెడ్డి రెండు టైటిళ్లతో మెరిసింది. గురువారం జరిగిన బాలికల అండర్-17 ఫైనల్లో శ్రేష్ట 7-11, 11-6, 11-4, 13-11తో కావ్య ఆనంద్‌పై అద్భుత విజయం సాధించింది. అదే జోరు కొనసాగిస్తూ అండర్-19 తుదిపోరులో శ్రేష్ట 11-5, 11-8, 11-4, 11-4తో జలనీపై గెలిచి రెండో టైటిల్ ఖాతాలో వేసుకుంది. పురుషుల టైటిల్ పోరులో మహమ్మద్ అలీ 12-10, 11-9, 4-11, 11-5, 4-11, 12-10తో వంశ్ సింఘాల్‌పై గెలిచాడు. మహిళల సింగిల్స్‌లో వరుణి జైస్వాల్ 4-0తో నిఖత్ భానుపై విజయం సాధించింది. మరోవైపు శౌర్యరాజ్ సక్సేనా, యశస్విన్, శ్రీసాన్వి, అక్షయ్, సత్య ఆస్పతి వేర్వేరు విభాగాల్లో విజేతలుగా నిలిచారు. -హైదరాబాద్, ఆట ప్రతినిధి:

### దక్కన్ జాగ్రఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా

## అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 17: దక్కన్ జాగ్రఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా 18వ అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను అధికారులు శుక్రవారం ఆవిష్కరించారు. ఓయూ పరిపాలనా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో బ్రోచర్‌తో పాటు సదస్సుకు సంబంధించిన వెబ్‌సైట్‌ను ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ ప్రారంభించారు. మార్చి నెల 5వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ సదస్సుకు హాజరయ్యేందుకు నూతనంగా రూపొందించిన వెబ్‌సైట్ www.18dgsi2024.comలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓయూ జాగ్రఫీ విభాగం హెడ్, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ అశోక్ కుమార్ లునావత్, సదస్సు చైర్మన్ ప్రొఫెసర్ అనురాధ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ మహ్మద్ అక్తర్ అలీ, అధ్యాపకులు డాక్టర్ కరుణాకర్, డాక్టర్ సుదర్శన్, శ్రీధర్, డాక్టర్ ఇందిర, డాక్టర్ కృష్ణనాయక్, ఫారూఖ్ సయీద్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఓయూ వీసీ, నిర్వాహకులు

# మరోసారి బీఆర్‌ఎస్‌దే విజయం

- మంత్రి కేటీఆర్‌రోడ్ షోను విజయవంతం చేయాలి
- డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్




సీతాఫల్‌మండి టీఆర్‌టీ క్వార్టర్స్‌లో కార్యకర్తలు,నాయకులతో సమావేశమైన డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

సికింద్రాబాద్,నవంబర్17: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రభుత్వం మరో సారి ఏర్పాటు కావడం ఖాయమని, సికింద్రాబాద్‌లో తాము హ్యాట్రిక్ సాధించడం తథ్యమని డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. శుక్రవారం సీతాఫల్‌మండిలో సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన సీతాఫల్‌మండి, మెట్టుగూడ, బౌద్ధనగర్ డివిజన్ల బీఆర్‌ఎస్ పార్టీ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని అన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి నిరంతరం శ్రమించామని, కొన్ని పార్టీలు కేవలం ఎన్నికల సందర్భాల్లో మాత్రమే ప్రజల వద్దకు వస్తున్నాయని అన్నారు. పార్టీ కార్యకర్తల శ్రమ కారణంగా సికింద్రాబాద్ ప్రాంతానికి తెలంగాణ రాష్ట్రంలో మంచి గుర్తింపు వస్తోందని అన్నారు. గతంలో కూడా సికింద్రాబాద్ నియోజకవర్గం వివిధ సంచలన విజయాలను తమ పార్టీకి అందించిందని పద్మారావు గౌడ్ తెలిపారు.

### నేడు మంత్రి కేటీఆర్ రోడ్‌షో...

బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సికింద్రాబాద్‌లో నిర్వహించే రోడ్ షో, సభలకు భారీ ఏర్పాట్లు జరపాలని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా కార్యకర్తలను,నాయకులను కోరారు. శనివారం సాయంత్రం 6 గంటలకు మంత్రి కేటీఆర్ అడ్డగుట్టలోని రియో పాయింట్‌కు చేరుకుంటారని, 25 వేల మంది ఆయనకు స్వాగతం పలికేలా జనాన్ని సమీకరించాలని పద్మారావు గౌడ్ కోరారు. అడ్డగుట్ట నుంచి మెట్టుగూడ, చిలకలగూడ చౌరస్తాల మీదుగా మైలార్‌గడ్డ ఎస్‌వీఎస్ కూడలి వద్దకు సాయంత్రం 7 గంటలకు చేరుకొని రెండో సభలో ప్రసంగిస్తారని పద్మారావు గౌడ్ తెలిపారు. కనీసం 20 వేల మంది సభకు హాజరవుతారని తెలిపారు. రెండు సభలకు భారీగా జనాన్ని తరలించేందుకు ఏర్పాట్లు జరుపుతున్నామని తెలిపారు



ముస్లింకు బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో అందజేసి ఓటు అభ్యర్థిస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి

### కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించండి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 17: మరొకసారి కారు గుర్తుకే ఓటు వేసి సికింద్రాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పద్మారావును గెలిపించాలని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి పిలుపునిచ్చారు. తార్నాక డివిజన్ మాణికేశ్వరీనగర్‌లోని హిమత్ అలీఖాన్ భాగ్ మసీదు వద్ద బీఆర్‌ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డితో కలిసి ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పద్మారావును అధిక మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించాలని ముస్లింలను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. మసీదు ఇమామ్, మోజాలకు నెలవారి గౌరవ వేతనం అందిస్తున్న ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు త్రినేత్రగౌడ్, ఖాజా పాషా, యాకూబ్ అలీ, ఫయాక్, ఆయూబ్, బాషా, కృష్ణ, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కుట్రలను తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్వీ నాయకుడు పెర్క శ్యామ్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 17: తెలంగాణ ఉద్యమ బలిదానాల గురించి అవహేళనగా మాట్లాడిన మాజీ కేంద్ర హోం శాఖ మంత్రి పి.చిదంబరం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్‌ఎస్వీ నాయకుడు పెర్క శ్యామ్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో 1200 మంది విద్యార్థుల బలిదానాలకు కారణమైంది కాంగ్రెస్ పార్టీయేనని ఆరోపించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పెర్క శ్యామ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమాన్ని కించపరిచేలా మాట్లాడిన చిదంబరం మాటలను విద్యార్థుల పక్షాన ఖండిస్తున్నామన్నారు. 1956 నుంచి 2014 వరకు వందల మంది యువత బలిదానాలకు కారణమైంది కాంగ్రెస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. చరిత్ర మరిచి, తెలంగాణ బలిదానాలకు తమకు బాధ్యత లేదని అవగాహన రహితంగా మాట్లాడడం సరికాదన్నారు. రాష్ట్ర ఏర్పాటు చేయడమంటే పిల్లలాట కాదన్న చిదంబరం అవగాహన లేకుండానే రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేశారా చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక తెలంగాణ అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా ఎదిగి అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవడాన్ని చూసి ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయబోతున్నారని, టీఆర్‌ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రానున్నదని గ్రహించి, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలను వంచించేందుకు కొత్త నాటకానికి తెరదీసిందన్నారు. తెలంగాణ మేధావులు, విద్యావంతులు ఆలోచించి, కాంగ్రెస్ పార్టీ కుట్రలను తిప్పికొట్టి మరొకమారు బీఆర్‌ఎస్ పార్టీకి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు మిథున్, శ్రీకాంత్, శ్యాంసుందర్, కురువన్న, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ నాజియా సుల్తానాకు సిల్వర్ మెడల్



ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 17: ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నాజియా సుల్తానా అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దుబాయిలో నిర్వహించిన అంతర్జాతీయ పరిశోధన అవార్డులు - 2023లో ఆమె రజత పతకం సాధించింది. ఈ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులు మొత్తం 162 పరిశోధన పత్రాలు సమర్పించగా, ఫైనాన్స్, అకౌంటింగ్, ఆడిటింగ్, ఎకనామిక్స్, ట్యాక్సేషన్ విభాగాల్లో ఇంటర్నేషనల్ రీసర్చ్ జ్యూరీ ఎంపిక చేసిన ఉత్తమ పరిశోధన పత్రాలకు బంగారు, రజత, కాంస్య పతకాలు ప్రదానం చేశారు. ఆమె రూపొందించిన పరిశోధన పత్రం 'సపోర్టివ్ పాలసీ ఇంటర్వెన్షన్ ఇన్ ఇంక్యుబేటింగ్ ఇన్నోవేటివ్ ఎంటర్‌ప్రైజెస్ ఫర్ క్రియేషన్ ఆఫ్ సెల్ఫ్ రిలయెంట్ ఎకానమీ'కు ఎకనామిక్స్ విభాగంలో రజత పతకం దక్కింది. ఆమె కోఠి మహిళా కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు.

## వివేకానంద డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 17: విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయంప్రతిపత్తి హోదాను మంజూరు చేస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఓయూ అధికారులకు సమాచారం అందించారు. దానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ హోదా వచ్చే విద్యా సంవత్సరం నుంచి పదేళ్ల పాటు కొనసాగనుంది. ప్రిన్సిపాల్ డాక్టర్ సుకన్య సంతోషం వ్యక్తం చేశారు.